క్లుప్తంగా

గాజుల అలంకరణ



చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని పొన్నియమ్మ(గ్రామదేవత)కు సోమవారం విశేష పూజలు చేశారు. ఈసందర్భంగా వేకువజామున అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. గాజులతో అలంకరణ చేశారు. ఈ అలంకరణ భక్తులను కనువిందు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కాణిపాకం ఎస్‌ఐగా నరసింహులు



ఐరాల: కాణిపాకం ఎస్ఐగా నరసింహులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

ట్రైనీ ఎస్‌ఐలుగా పలువురు



అశోక్‌కుమార్

బంగారుపాళెం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ ఎస్ఐగా అశోక్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లాకు చెందిన అశోక్‌కుమార్ 2024–25 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ ఎస్ఐ 5 నెలల పాటు శిక్షణ పొందనున్నారు. కొత్తగా వచ్చిన ట్రైనీ ఎస్ఐ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే విధానం.. ప్రజలతో వ్యవహరించే తీరు.. కేసుల నమోదు, దర్యాప్తు తదితర అంశాలపై శిక్షణ తీసుకునేందుకు బంగారుపాళెం పోలీస్ స్టేషన్‌కు వచ్చినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

పూతలపట్టులో..



తేజస్విని

పూతలపట్టు(యాదమరి): పూతలపట్టు మండల ట్రైనీ ఎస్ఐగా డి.తేజస్విని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బొలేరో వాహనం ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన వారు

పలమనేరు: పట్టణ సమీపంలోని నాగమంగళం వద్ద చైన్నై–బెంగళూరు హైవేలో సోమవారం బైక్‌ను బొలేరో వాహనం ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని దుగ్గినవారిపల్లికి చెందిన పెద్ద రెడ్డెప్ప తన భార్య, కుమార్తెతో కలిసి బైక్‌లో పలమనేరు బయలుదేరాడు. నాగమంగళం వద్ద బొలేరో వాహనం ఢీకొంది. బైక్ పది మీటర్ల దూరం ఎగిరిపడింది. ఈ ప్రమాదంలో పెద్దరెడ్డెప్ప(50) ఆయన భార్య నీలమ్మ(45), కుమార్తె లలిత(22) తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వారిని చిత్తూరుకు రెఫర్ చేశారు. పలమనేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. అతను మద్యం మత్తులో ఉన్నట్టు స్థానికులు తెలిపారు.

బకాయిలు ఉంటే కష్టమే..!

ప్రభుత్వశాఖల సమన్వయం, సంస్కరణల పేరిట సర్కారు ఆదాయ మార్గాలకు కొత్త దారి ఎంచుకుంది. ఇక మీదట ఇంటి, నీటి పన్ను బకాయిలు ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్ జరగవు. గతంలో ఈ పన్నుల బకాయిలు ఉన్న రిజిస్ట్రేషన్లు జరిగేవి. తరువాత వినియోగదారుడు మున్సిపల్ కార్యాలయంలో మ్యుటేషన్ చేసుకునేవారు. ఈ ప్రక్రియలో పన్ను బకాయిలు ఉన్నా.. రిజిస్ట్రేషన్ శాఖకు వాటితో సంబంధం లేదు గనుక రిజిస్ట్రేషన్ చేస్తారు. తదుపరి మ్యుటేషన్ (ఓనర్‌షిప్ మారడం) ప్రక్రియను పూర్తి చేస్తారు. సచివాలయాల నుంచి నగరపాలక కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం పరిశీలన అయ్యాక టైటిల్ మార్పు చేసి పన్ను విధిస్తారు. ఈ విధానంలో మార్పు తీసుకొస్తూ ఆటో మ్యుటేషన్ పేరిట కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు.

- ఆగస్టు 1 నుంచి నగరాల్లో ఆస్తులకు ఆటో మ్యుటేషన్
- పన్ను బకాయిలు ఉంటే స్లాట్ బుక్ అవ్వదు
- మార్కెట్ విలువ, విస్తీర్ణం ఆధారంగా మ్యుటేషన్ చార్జీలు
- నగరవాసులకు ఎంతో ప్రయోజనం అంటున్న రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు



చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: వ్యవసాయ పొలాలకు మాత్రమే ప్రస్తుతం ఆటోమ్యుటేషన్ విధానం అమల్లో ఉంది. వాటిని నగరాల్లోని ఇళ్లు, వాణిజ్య సముదాయాలకు ఆగస్టు 1 నుంచి అమలు చేయనున్నారు. తొలుత ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా విజయవాడలో అమలు చేశారు. అక్కడ ఆశించిన స్థాయిలో ఆదాయం రావడంతో రాష్ట్రవ్యాప్తంగా 17 కార్పొరేషన్ల పరిధిలో అమలు చేయనున్నారు. నగరాల్లో ఏదైనా స్థలం లేదా ఇళ్లు తీసుకుంటే కొనుగోలుదారులు ఆస్తిని తమ పేరిట మార్చుకునేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో వీటి కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పుడు అలా కాకుండా ఆస్తి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా ఆటో మ్యుటేషన్ జరగనున్నది. వీటిపై నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్‌తో కలిసి జిల్లా రిజిస్ట్రార్ రమణ మూర్తి, సబ్‌రిజిస్ట్రార్లు, డ్యాకుమెంట్ రైటర్లకు వీటిపై అవగాహన కల్పించారు.

ఎందుకు స్లాట్ బుక్ అవ్వదంటే..!

గతంలో స్థలాలు, ఇళ్లు, వాణిజ్య సముదాయాల రిజిస్ట్రేషన్‌కు మ్యుటేషన్‌కు సంబంధం లేదు. పన్ను బకాయిల విషయం వారికి పట్టవు. రిజిస్ట్రేషన్ అయ్యాక కొనుగోలుదారులు ఆ పత్రాల వివరాలతో నగరపాలక కార్యాలయంలో ఓనర్‌షిప్ మార్చుకోవడానికి దరఖాస్తు చేసేవారు. ఇక అలా కాకుండా రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ సమయంలోనే పన్నులు పెండింగ్ లేకుండా అప్‌డేట్ అయి ఉండాలి. సంబంధిత వివరాలను అప్‌లోడ్ చేశాక స్లాట్ బుక్ అవుతుంది. గతంలో రిజిస్ట్రేషన్ సమయంలో ఇంటికి చెల్లిస్తున్న రశీదు ఇవ్వాలి. స్థలమైతే (ఖాళీ స్థలం పన్ను) రశీదు అందజేయాలి. ఇంటి పన్ను సమర్పించాలి. ఒకవేళ ఒకే ఆస్తిని ఇద్దరూ లేదా ముగ్గురు కలసి కొనుగోలు చేసినా ఇదే విధానం వర్తిస్తుంది. మున్సిపాలిటీ ఇచ్చిన అసెస్‌మెంటు నంబర్లు తప్పక నమోదుచేయాలి. మార్కెట్ విలువ, విస్తీర్ణం ఆధారంగా మ్యుటేషన్ చార్జీలు చెల్లించాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కాగానే.. ఆ వివరాలను కార్పొరేషన్ అధికారులకు ఆన్‌లైన్ ద్వారా తెలియజేస్తారు. అక్కడ పరిశీలించి ఓకే చెప్పగానే ఆటోమ్యుటేషన్ సర్టిఫికెట్ జనరేట్ అవుతుంది. ప్రక్రియ ముగిశాక అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా కొత్త డాక్యుమెంట్లతో పాటు ఆస్తి బదలాయింపు పత్రం కూడా పొందేలా ప్రక్రియ చేపట్టారు. మార్కెట్ విలువ, విస్తీర్ణం ఆధారంగా మ్యుటేషన్ చార్జీలు చెల్లించాలి. ఒక అసెస్‌మెంట్ నంబర్‌పై ఒకటి కంటే ఎక్కువ ఆస్తులున్నా.. పార్టుల వారీగా రిజిస్ట్రేషన్ జరిగినా ఆటోమ్యుటేషన్ జరిగిపోతుంది.

వినియోగదారులకు ఉపయోగకరం



ఆటోమ్యుటేషన్ విధానాన్ని కొత్తగా ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రవేశ పెట్టనున్నారు. రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ సమయంలోనే నగర పరిధిలోని ఆస్తుల అసెస్‌మెంట్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. అప్పుడు ఎటువంటి బకాయిలు ఉండరాదు. ఈ విధానంతో వేగంగా మ్యుటేషన్ జరుగుతుంది. వినియోగదారులకు ఉపయోగకరం.

–రమణమూర్తి, జిల్లా రిజిస్ట్రార్

స్టడీ మెటీరియల్ వితరణ



విద్యార్థులతో దాత త్యాగరాజులనాయుడు, టీచర్లు

యాదమరి: మండలంలోని కె.గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.10 వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను చిత్తూరు జిల్లా సాక్షరత సమితి ఉద్యోగి, విశ్రాంత ఉపాధ్యాయులు త్యాగరాజనాయుడు అందజేశారు. సోమవారం ఆయన స్కూల్‌ను సందర్శించి హెచ్ఎం లలిత చేతుల మీదుగా 75 మంది పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం జిల్లా సాక్షరత సమితిలో ఎలాంటి వేతనం తీసుకోకుండా వయోజన విద్య కోసం కృషి చేస్తున్న త్యాగరాజుల నాయుడు సేవలు అందించడం గర్వకారణమన్నారు. ప్రతినెలా తనకు వచ్చే పింఛన్ సొమ్ము నుంచి కొంతమొత్తాన్ని పేద విద్యార్థులకు వెచ్చించడం అభినందనీయమన్నారు. దాత మాట్లాడుతూ విద్యార్థులంతా పాఠశాల స్థాయి నుంచే ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): యువకుడిపై దాడిచేసిన ఘటనలో సోమవారం ఓ వ్యక్తిపై సోమవారం తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా.. ఆదివారం సాధిక్ అనే యువకుడు తన స్నేహితుడి పుట్టినరోజు సందర్భంగా మురకంబట్టు కూడలిలో శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అయితే ఈ ఫ్లెక్సీ ఏర్పాటుపై సాధిక్‌కు చిన్నికి వాగ్వివాదం చోటు చేసుకుంది. సాధిక్‌ను ఫ్లెక్సీ పెట్టేంత నాయకుడా అంటూ చిన్ని దూషించాడు. మాటామాటా పెరగడంతో సాధిక్‌పై చిన్ని దాడి చేశాడు. దీనిపై బాధితుడు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఈమేరకు చిన్నిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు పొందిన సిప్ అబాకస్ సంస్థ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన అబాకస్ గణిత మేధ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించారని సిప్ అబాకస్ సంస్థ నిర్వాహకులు లత, మురళి అన్నారు. ఈ మేరకు సోమవారం గురునగర్ కాలనీలోని ఆ సంస్థ కార్యాలయంలో రాష్ట్రస్థాయి పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన విజయవాడలో రాష్ట్రస్థాయి అబాకస్ గణిత మేధ పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో తమ సంస్థకు చెందిన భార్గవ స్వర్ణ పతకాన్ని కై వసం చేసుకున్నట్లు తెలిపారు. కుమార్ రజతాన్ని సాధించాడని చెప్పారు. మోహిత్, తేజేష్, హద్విత, తేజుశ్రీ కాంస్య పతకాలను పొందారన్నారు. యుక్తశ్రీ, సాకేత్ కుమార్, కార్తీక్‌సాయి, కేదార్ కృష్ణ, దీక్షిత, యశ్వంత్, రిషి, అభినవ్, హర్షవర్ధన్ నాలుగో స్థానంలో నిలిచి బహుమతులు పొందారన్నారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు.

వాసు ట్రస్ట్ సేవలు అభినందనీయం

ఐరాల: ఏటా పేద విద్యార్థులకు వాసు ట్రస్ట్ ద్వారా విద్యాసామగ్రి అందజేయడం అభినందనీయమని 35 యర్లంపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గంగిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని 35 యర్లంపల్లె, చెంగనపల్లె పంచాయతీలోని 7 ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 200 మంది విద్యార్థులకు 35 యర్లంపల్లెకు చెందిన వాసు ట్రస్ట్ నిర్వాహకుడు రాజారాం నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు ఇతర విద్యాసామగ్రి ఆయా పాఠశాలల హెచ్ఎంల ఆధ్వర్యంలో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాసు ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఈశ్వర్ సొంత నిధులు వెచ్చించి గత 18 ఏళ్లుగా విద్యా సంవత్సరం ప్రారంభంలో పేద విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. హెచ్ఎం గంగిరెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. దాతల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు జనార్ధన్, సుధాకర్, చలపతి, గుణసుందరి, కార్తీక్‌రాజు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణ అవసరం



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రెడ్డెప్ప

ఐరాల: మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప సూచించారు. సోమవారం మండలంలోని వేదగిరివారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 45 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, థైరాయిడ్, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల, అపరిశుభ్రత వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అలాగే నీటి కలుషితం వల్ల వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్, కామెర్లు తదితర వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, ఎంపీహెచ్ఏ మునిరత్నం, ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆగని వృక్ష విలాపం..





టి.పుత్తూరు సమీపంలో పెద్ద వృక్షాన్ని(చింతచెట్టు) యంత్రంతో కోసిన కూలీలు, తవణంపల్లె మీదుగా ట్రాక్టర్‌లో తరలిపోతున్న కలప

తవణంపల్లె: మొక్కలు నాటండి..ఆపై వాటిని సంరక్షించండి.. వృక్ష సంపదను పెంపొందించండి.. ఇవీ మన పాలకులు.. అధికారులు పదేపదే వల్లె మాటలు. ఏదో మొక్కల దినోత్సవం.. లేదా ఇంకేదో దినమని నాలుగు మొక్కలు నాటి పొటోలకు ఫోజులిచ్చి వెళ్లడం రివాజు. దీనికితోడు ఉపాధి హామీ పథకం కింద విరివిగా మొక్కలు నాటే కార్యక్రమం కూడా చేపట్టారు. అయితే ఇలా నాటిన మొక్కల్లో చాలావరకు ప్రకృతి కరుణించి.. వర్షాలు పడి వాటంతట అవే పెరిగి పెద్దవి అవుతాయన్నది జగమెరిగిన సత్యం. మరి అలా పెరిగిన వృక్షాలను యంత్రాలతో కోసి కలపగా మార్చి కొందరు వ్యాపారులు ట్రాక్టర్లు, లారీల్లో తమిళనాడుకు, కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్న ఘటనలు తవణంపల్లె మండలంలో వెలుగు చూస్తున్నాయి. అయితే కళ్లెదుటే భారీ వృక్షాలను నరికివేస్తున్నా.. అటవీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని ముత్తరపల్లె క్రాస్‌లో ఇటీవల ఆర్‌అండ్‌బీ రోడ్డు సమీపంలోని భారీ చింతచెట్టును పదిమంది కూలీలచే కోయించి ముక్కలు చేసి తరలించారు. అదేవిధంగా మూడు రోజుల క్రితం టి.పుత్తూరు సమీపంలో రోడ్డు పక్కనే అతి పెద్ద వృక్షం నేలమట్టం చేసి తరలించారు. దీనిపై సంతపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రెడ్డెప్పను వివరణ కోరగా కట్టెల తరలించడం తమ దృష్టికి రాలేదని వివరణ ఇచ్చారు. అక్రమంగా అనుమతి లేకుండా కలప తరలిస్తే చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సర్పంచులకు సహకరించాలి

పలమనేరు: అభివృద్ధి పనులకు అధికారులు సహకరించడం లేదని, ఇలా అయితే పంచాయతీలు ఎలా అభివృద్ధి చెందుతాయని పలువురు సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఏది చెప్పినా పట్టించుకోకపోవడం దారుణమని వాపోయారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ రోజా అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, పలువురు సర్పంచులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కాని మండల సమావేశాలు ఉపయోగం లేదన్నారు. అధికారులు అధికార పార్టీ నేతలు చెప్పినట్టు వింటున్నారని, ప్రజల ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఏమి విలువ ఉంటుందని ప్రశ్నించారు. ఎస్టీలు ఎక్కువగా ఉన్న జగమర్ల పంచాయతీలో అధికారులు వివక్ష చూపుతూ అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



మాట్లాడుతున్న మేయర్ అముద, పాల్గొన్న అధికారులు, కార్పొరేటర్లు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం పాలకవర్గం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. మేయర్ అముద అధ్యక్షతన జరిగి సమావేశంలో కమిషనర్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, సభ్యులు నిర్మల, శశికుమార్, సుష్మా, అశోక్ పాల్గొన్నారు. నగరంలోని పలుచోట్ల బీటీ రోడ్లు, మురుగునీటి కాలువలు, నిర్దేశించిన ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు, ప్రహరీ నిర్మాణాలకు టెండర్లు పిలవగా.. వాటిని ఆమోదించారు. 8వ డివిజన్‌లోని వెంగళరావు కాలనీలో నీటి ప్రవాహానికి సంబంధించి శాశ్వత పరిష్కారంలో భాగంగా మేజర్ స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. వీధి కుక్కల నియంత్రణలో భాగంగా కు.ని. చేయడానికి పరికరాలు, మందుల కొనుగోలుకు అంగీరించారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తూ మృతి చెందిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ పాల్గొన్నారు.

విన్నవిస్తున్నాం.. చూపండి పరిష్కారం

అయ్యా.. న్యాయం చేయండని మీ చుట్టూ ఎన్నిసార్లు తిరుగుతున్నామో మాకే తెలియదు.. ఎన్నిసార్లు మా బాధలు చెప్పినా.. న్యాయం జరగడం లేదు.. ఒకసారి మా సమస్యలపై దృష్టి సారించండయ్యా..అంటూ చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలను అధికారులకు ఏకరువు పెట్టారు. సోమవారం అన్ని మండలకేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఆయా మండలాల అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అయితే జిల్లా కలెక్టర్ ఆదేశాలను కొన్ని మండలాల్లో కొందరు అధికారులు బేఖాతరు చేస్తున్నారు. లైట్ తీసుకుంటూ.. ఈ కార్యక్రజుమానికి ధుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆలయ భూములను కాపాడండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జగదీశ్వర్‌రెడ్డి

పూతలపట్టు(యాదమరి): పూతలపట్టు గ్రామంలో ఆలయాలకు విరాళంగా ఇచ్చిన భూములను కొందరు అక్రమంగా ఆక్రమించుకుంటున్నారని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల వేదిక కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామస్తులతో కలిసి స్థానిక తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ స్థానిక శ్రీరాముడి ఆలయానికి తమ పూర్వీకులు 1962వ సంవత్సరంలో సర్వే నంబర్ 571/2 లో 33 సెంట్ల భూమిని పాకాల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్టర్ చేసి ఇచ్చామన్నారు. అయితే ఈ భూములకు పక్కనే ఉన్న మరో భూయజమాని హరిబాబునాయుడు అనే వ్యక్తి జేసీబీ యంత్రాలతో ముళ్లపొదలను తొలగించి ఆలయ భూమిలో ఆవుల ఎరువును తరలించి అక్రమంగా ఆక్రమించుకోవడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై గ్రామస్తులు అతన్ని ప్రశ్నించగా దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. సదరు వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకుని ఆలయ భూములకు రక్షణ కల్పించాలని కోరారు. మండలంలో చాలా వరకు ఆలయాల భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని, వాటిని పరిరక్షించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ రమేష్‌బాబు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ మాసిలామణి, కోఆప్షన్ సభ్యులు ఖాదర్‌వల్లి, బాబురెడ్డి, ఆలయ ధర్మకర్త మల్లికార్జునశెట్టి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



బంగారుపాళెంలో వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

బంగారుపాళెం: భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో దారి సమస్యలు, భూసర్వే, రికార్డుల్లో తప్పులను సరి చేయాలంటూ పలువురు తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఓలు తమ రెవెన్యూ గ్రామాల పరిధిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో విచారించండి



మహిళల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజల సమస్యలు, వారు ఇచ్చే వినతులు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రధానంగా పింఛన్లు, ఇంటి పన్నులు, కాలువలు–రోడ్లకు సంబంధించి పలువురు వినతులు అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్థిక అంశాలతో ముడిపడిన వాటి ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అధికారుల డుమ్మా



తవణంపల్లెలో రెండు శాఖల అధికారులు మాత్రమే హాజరైన దృశ్యం

తవణంపల్లె: మండల కేంద్రంలో సోమవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు ధుమ్మా కొడుతున్నారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని రావడానికి ప్రభుత్వ కార్యాలయాలకు విచ్చేస్తారు. కానీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మినహా మిగతా శాఖల అధికారులు ఎవరూ హాజరుకాలేదు. మండలస్థాయి అధికారులు కలెక్టర్ ఆదేశాలను ఖాతరు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు తహసీల్దార్ సుధాకర్ రెవెన్యూ కార్యాలయంలో రైతుల ఉంచి భూసమస్యలపై అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను వెంటనే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వీఆర్‌ఓలకు సూచించారు.

యూరియా కోసం బారులు



క్యూలో ఉన్న రైతులు

బైరెడ్డిపల్లె: మండలంలో యూరియా కొరత నెలకొనడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బైరెడ్డిపల్లెకు చెందిన ఒక ఎరువుల దుకాణ యజమాని సోమవారం యూరియా లోడు తెప్పించారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని బారులు తీరారు. వారు మాట్లా డుతూ పంటలు సాగు చేయాలంటే ఎరువుల కొరత వుందని, అనేక కష్టాలకు ఓర్చి పంటలు పండించినా గిట్టుబాటు ధర అందక నష్టపోవాల్సి వస్తోందని వాపోయారు. ప్రభుత్వం చొరవ చూపి రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. గత ప్రభుత్వంలో ఎప్పుడూ ఎరువుల కొరత ఉండేది కాదని, ప్రస్తుతం ఎరువుల కొరత తీవ్రంగా నెలకొందని చెబుతున్నారు.